ఎఫ్‌డీడీఐలో వినూత్న కార్యక్రమం

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'యంగ్ మైండ్స్ ఎక్స్‌ప్లోర్ డిజైన్ హరిజన్స్ ఎట్ ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్' పేరిట శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా ప్రభా ఫౌండేషన్ నుంచి 35 మంది విద్యార్థులు, అయిదు మంది అధ్యాపకులతో కూడిన బృందానికి అతిథ్యం ఇచ్చింది. యువ ఆశావహులలో సహ కారం అభ్యాసాన్ని పెంపొందించడం, డిజైన్‌పై అవగాహనను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్‌డీడీఐ ప్రతినిధి ఫైజీ మాట్లాడారు. అనంతరం పాదరక్షలు, ఫ్యా షన్, జీవనశైలి, ఉత్పత్తి రూపకల్పన సాధనాలు, సాంకేతికతను వివరించారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురికి మెంబర్‌షిప్ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆయిషా బేగం మార్గదర్శకురాలిగా ఉంటున్నారన్నారు. ఆమె సూచనల మేరకే తాము ఫ్యామిలీ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాన్సీలింగ్, ఇనాయత్ తదితరులున్నారు.

'దేశం గర్వించదగ్గ నిర్ణయాలు తీసుకోవడంలో మోదీ దిట్ట'

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన కూడా చేయించడం సాహసోపేతమైన నిర్ణయం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. కుల గణన, ఓబీసీల భవిష్యత్తు నిర్మాణం తదితర అంశాలపై శనివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించదగ్గ నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధాని నరేంద్రమోదీ దిట్ట అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో మాక్ డిజాస్టర్ డ్రిల్



మాదాపూర్: అత్యవసర పరిస్థితులలో సమర్థవంతమైన స్పందన కోసం మెడికవర్ హాస్పిటల్స్ శనివారం మాక్ డిజాస్టర్ డ్రిల్ నిర్వహించింది. అగ్నిప్రమాదం, సామూహిక ప్రమాద పరిస్థితిని ఆధారంగా తీసుకుని ఎలా స్పందించాలో డ్రిల్ ద్వారా వివరించారు. ఈ డ్రిల్‌లో ఆసుపత్రి సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, ఫైర్ సర్వీసు, పోలీస్, అంబులెన్స్ బృందాలు భాగస్వామ్యమయ్యాయి. అత్యవసర పరిస్థితులలో ఎలా స్పందించాలో ప్రదర్శించారు.

స్టేడియం పూర్తయ్యేనా?

● పట్టించుకోని అధికారులు ● క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు ● నీరుగారుతున్న పాలకుల హామీలు

మణికొండ: రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తాం... అందుకే క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం ... గ్రామ స్థాయి నుంచి క్రీడా కారులను ప్రోత్సహిస్తాం.. వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తాం... ఇదీ పాలకులు క్రీడల గురించి పలు సందర్భాలలో ఇచ్చిన హామీలు. గత ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఓ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్థలాలను కేటాయించింది. ప్రభుత్వ చివరి నెలల్లో ఆ పనులను చేపట్టడంతో ఎక్కువ మున్సిపాలిటీలలో సగం పనులే పూర్తి అయ్యాయి. ప్రభుత్వం మారటంతో ఆ పనులు కాస్తా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారయ్యాయి. అప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేయటంతో నిధులు, స్థలాలు వృథాగా మారటం పట్ల పలు మున్సిపాలిటీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

☛ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అన్ని రంగాలలో క్రీడాకారులు ఉన్నారు. జిల్లా స్థాయి మొదలుకుని అంతర్జాతీయ స్థాయి వరకు పతకాలను సాధించి మున్సిపాలిటీలకు మంచి పేరు తెస్తున్నారు. వారికి మరిన్ని సౌకర్యాలను కల్పించి ప్రోత్సహిస్తే మన మున్సిపాలిటీలకు మరింత గుర్తింపు తెస్తారనడం అతిశయోక్తికాదు. అలాంటి వారికి అనువైన క్రీడా ప్రాంగణాలు లేక పోవటంతో డబ్బున్న వారు ప్రైవేటు స్పోర్ట్స్ క్లబ్‌లలో శిక్షణ పొందుతుండగా అవీ లేని వారు మిన్నకుంటున్నారు.



అభివృద్ధికి నోచుకోని మణికొండ క్రీడా ప్రాంగణం



అసంపూర్తిగా ఉన్న గ్యాలరీ పనులు

మూడు సంవత్సరాలుగా...

మణికొండలోని ల్యాంకోహిల్స్ పక్కన 2022లో క్రీడా ప్రాంగణ పనులకు స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. అప్పట్లో దాని అభివృద్ధికి రూ. 2 కోట్ల వరకు ఖర్చుచేసి చదును చేయటం, నెట్‌పోల్‌లు, గ్యాలరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే ఆ పనులన్నీ మధ్యలోనే నిలిచిపోవటంతో తమకు ఎలాంటి అదనపు వసతులు సమకూరలేదని క్రీడాకారులు వాపోతున్నారు. మిగతా పనులను పూర్తి చేస్తేనే తమకు అనువుగా ఉంటుందటున్నారు.

☛ ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, రన్నింగ్, వాకింగ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. అక్కడ కనీసం తాగే నీరు, కొద్దిసేపు కూర్చునేందుకు అనువైన స్థలం లేక వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ ఇకనైనా సంబంధిత ఉన్నధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మణికొండ ల్యాంకోహిల్స్ పక్కన క్రీడా ప్రాంగణం పనులు మధ్యలో నిలిచిపోయిన విషయం వాస్తవమే. వాటిని పూర్తి చేయాలని చాలా మంది కోరారు. ఇప్పటి వరకు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకే నిధుల లభ్యత అంతంత మాత్రంగా ఉండటంతో స్టేడియం పనులను పక్కన పెట్టాం. ఇటీవల నిధుల లభ్యత పెరిగింది. దీంతో దాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి హైటెక్ స్టేడియంగా తీర్చి దిద్దేందుకు ఇటీవలనే టెండర్లను పిలిచాం. త్వరలోనే పనులను మొదలు పెట్టించి పూర్తి చేస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

మణికొండ: విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుండటంతో చాలా ఇళ్లల్లో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని తద్వారా వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1, 2లలో గుడ్‌మార్నింగ్ మణికొండ పేరిట ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల సెక్రటేరియట్ కాలనీలో ఇలాంటి విద్యుత్ సరఫరా కారణంగానే ఏసీలో మంటలు వచ్చి ఓ సినీ కొరియోగ్రాఫర్ మృతి చెందారని గుర్తుచేశారు. వేసవిలో ప్రజల అవసరాల మేరకు నీటి సరఫరా పెంచి ఇవ్వాల్సిన జలమండలి అధికారులు ఇష్టారాజ్యంగా కొత్త కనెక్షన్‌లు ఇచ్చి కాలనీలకు నీటిని తగ్గిస్తున్నారన్నారు. కొత్త కనెక్షన్‌లు ఇచ్చి డబ్బులు దండుకోవటంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయటంపై లేదన్నారు. కోర్టు ద్వారా స్థలాన్ని పొంది అందులో రిజర్వాయర్‌ను నిర్మించి ప్రారంభించినా దాన్ని వినియోగించుకోకపోవటంలో ఆంతర్యం ఏమిటని అలకాపూర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికం అవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. పారిశుద్ధ్య పనులను అంతంత మాత్రంగానే కొనసాగిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు జి.నరేందర్, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, శ్రీకాంత్, కిరణ్, సుమ నళిని, బి.శ్రీధర్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అలకాపూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

చింతల్‌మెట్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, వాదియామహ్మద్, హసన్‌నగర్, ఎంఎం పహాడీ, వీరన్నకుంట, మదీనామసీద్, కింగ్స్‌కాలనీ, నౌనంబర్ తదితర ప్రాంతాల్లోని పలు బస్తీల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా తయారయ్యారు. పలు స్తంభాలు కిందకు వంగి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రధానంగా సులేమాన్ నగర్ డివిజన్‌లోని చింతల్‌మెట్ హనుమాన్ దేవాలయం వెనుక బస్తీలో దాదాపు 10కి పైగా స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. రోడ్ల మధ్యలో స్తంభాలు ఉన్నందున పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. పలు మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని బస్తీల ప్రజలు వాపోతున్నారు.

– శాస్త్రిపురం



హనుమాన్ మందిరం వెనుక బస్తీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి మేకల అగ్నిహోత్రి పుష్పాంజలి, నవరస శ్లోకం, దరువు వర్ణం, అంతఃపుర గీతం, ఆనంద నటన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శ్రీదేవి ప్రశాంత్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా మూషికవాహన, బ్రహ్మాంజలి, అలరులు కురియగా, దశావతార శబ్దం, నీలిమేఘ శరీర తదితర అంశాలను ఇరా, ఊర్మిళ, గీతికా, చార్వి, దియా, నైనికా, నిషిద్ధ, జాహ్నవి, అనూష, తనుశ్రీ, గోవర్ధిని ప్రదర్శించారు.



సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా తరలిరావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక సీఐటీయూ నాయకులు, కార్మికులతో జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, బ్యాంకు ఫెడరేషన్లు ఏకమై సమ్మెను చేస్తున్నారని అన్నారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శులు అల్లి దేవేందర్, వీరయ్య, సునీత, స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య, ఈ.నర్సింహ్మా, టి.నర్సింహ్మా, ఎల్లేష్, బుగ్గ రాములు, ప్రవీణ్, పెంటయ్య, ఎల్లయ్య, రాములు, బుట్టి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన శక్తిగా బీజేపీ

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతాపార్టీకి ప్రజాబలం రోజురోజుకూ పెరుగుతూ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ పేర్కొన్నారు. రాజ్ భూపాల్ గౌడ్‌ను శనివారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్ కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన భూపాల్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో వేముల మల్లేష్ మాట్లాడుతూ... జిల్లాలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రజల తరపున పోరాటం చేస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నామన్నారు. తద్వారా బలమైన శక్తిగా ఎదుగుతోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాల్లో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలంగా ఎదుగుతున్నదన్నారు.



జిల్లా అధ్యక్షుడిని కలిసిన మల్లేష్

వ్యక్తి అదృశ్యం



గొల్ల రాజు

అత్తాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రబోడ ప్రాంతానికి చెందిన గొల్ల రాజు(60) ఈ నెల 2వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్ సిద్ధం

గోల్కొండ: సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రించడానికి నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణం పూర్తయ్యింది. టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు దీనిని తయారు చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించారు. త్వరలోనే దీనిని ప్రారంభించే అవకాశం ఉంది.

అమర జవానులకు నివాళి

మైలార్‌దేవ్‌పల్లి: దేశ ప్రజల రక్షణ కోసం సరిహద్దుల్లో జవాన్లు తమ ప్రాణాలను అర్పిస్తున్నారని వారి సేవలు ఎంతో గొప్పవని రాష్ట్ర సీఐటీయూ ఉపాధ్యక్షుడు భూపాల్, సహాయ కార్యదర్శి కూరపాటి రమేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రమోహన్‌లు అన్నారు. శనివారం కాటేదాన్‌లో సీఐటీయూ నాయకులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన అమర జవాన్లకు నివాళులర్పించారు. ఇండియా–పాకిస్థాన్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్‌లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ భారతదేశంపైకి ఉసిగొల్పుతుందని ఆ ఉగ్రవాదాన్ని భారత సైనికులు దృఢ సంకల్పంతో ఎదుర్కొంటున్నారన్నారు. ఇండియా, పాకిస్థాన్ యుద్ధంలో వీర జవాన్లు అమరులయ్యారని, పాకిస్థాన్ దుశ్చర్యలను వ్యతిరేకించాలని ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌ను వ్యతిరేకించి భారతదేశానికి మద్దతుగా ఉండాలన్నారు. ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న భారత దేశానికి మద్దతుగా నిలిచి పాకిస్థాన్ దుశ్చర్యలను నిలువరించాలని అన్నారు. ఈ దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న సైనికుల త్యాగం చాలా గొప్పదని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శులు అల్లి దేవేందర్, వీరయ్య, స్వప్న, సునీత, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లేష్, నర్సింహ్మా, ఎల్లయ్య, పెంటయ్య, రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కాటేదాన్‌లో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నేతలు

మణికొండ పరిధిలో...

మణికొండ: దేశ రక్షణ కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావిస్తున్న వీర సైనికులకు పలు ప్రాంతాల్లో ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. హుడా కాలనీ సర్దార్ పటేల్ పార్క్ వద్ద శనివారం మణికొండ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమర జవానులు మురళీనాయక్, సూరజ్ యాదవ్, అమిత్ చౌదరి, దినేష్‌కుమార్, కమల్ కంభోజ్, సచిన్ యాదవ్, దినేష్ శర్మ ఘనంగా నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.ప్రభూజీ, గౌరవాధ్యక్షులు రామానుజం, టి.రమేష్‌బాబు మాట్లాడుతూ... కశ్మీర్ లోయలో పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వెళ్లిన అమాయకులకు మతం అడిగి మరీ కాల్చటం దుర్మార్గమన్నారు. అలాంటి వారి ఉనికి ప్రపంచంలో ఎక్కడా లేకుండా చేయాల్సిన బాధ్యత అన్ని దేశాలపై ఉందన్నారు. అసోసియేషన్ నాయకులు మనోహర్, సుగుణరాజు, శంకర్‌రాజు, మీరావలి, రామచంద్రరావు, వెంకట్‌రెడ్డి, భారత్ వికాస్ పరిషత్ మణికొండ శాఖ అధ్యక్షుడు పెంటారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘుసతీష్, సతీష్‌కుమార్, నవ సంకల్ప సేవా ట్రస్ట్ సభ్యులు మణి, అజార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ది సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చింతచెట్టు సర్కిల్ నుంచి అలకాపూర్ యోగా సర్కిల్ వరకు సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డి.సీతారం, కార్యదర్శి బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... దేశ పౌరులంతా మన త్రివిధ దళాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపకుండా పీఓకేను స్వాధీనం చేసుకునే వరకు కొనసాగించాలన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, కౌన్సిల్ సభ్యులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



అలకాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ది సిటిజన్ కౌన్సిల్ సభ్యులు



హుడా కాలనీలో నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

సమస్యలు పరిష్కరించండి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్ మాధవహిల్స్–2, శిల్పావ్యాలీ కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నల్లగండ్లలోని కార్పొరేటర్ నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యలను అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపినగర్‌బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, మాధవహిల్స్–2 అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోపీచంద్, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, సభ్యులు సంతోష్, భవాని, సభ్యులు శివా, సంయుక్త కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

షేక్‌పేట్ అభివృద్ధికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ కృషి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. షేక్‌పేట్‌లోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ విద్యుత్ లైట్ల అభివృద్ధికి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ రూ.లక్ష మంజూరు చేశారు. ఈ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలలో వీడీ సీసీ రోడ్లు, మోడ్రన్ విద్యుత్ దీపాలు ఎంపీ చొరవతోనే పూర్తయ్యాయన్నారు. అంతేకాకుండా ఓ వైపు బస్తీలను అభివృద్ధి చేస్తూనే కాలనీల్లో సైతం అభివృద్ధి పనులను ఆయన నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సి.నర్సింగ్‌రావు, కార్యదర్శి మల్లేష్, ప్రధాన కార్యదర్శులు హరి, రవి తదితరులున్నారు.



షేక్‌పేట్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు